మోగిన ఎన్నికల నగారా





- వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్షల్లో ఓటర్లు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎలక్షన్ కమిషన్

సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో శనివారం నుంచే జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధి అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇప్పటికే సహాయ ఎన్నికల అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. కాగా రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో కలిపి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 66,42,643 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

వికారాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. మే 13న ఎన్నికల పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. వికారాబాద్ జిల్లా పరిధిలో కొచ్చే చేవెళ్ల, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న సంబంధిత రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి అసెంబ్లీ సెగ్మెంట్లు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. అలాగే కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల 26 నుంచి ఆ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, రాజకీయేతరులు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినా సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పకడ్బందీగా అమలు పరిచేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్, సహాయ వ్యయ పరిశీలకులను నియమించారు. 4 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 24 ఎఫ్ఎస్‌టీ, 24 ఎస్ఎస్‌టీ, 8 వీఎల్‌టీ, 4 వీవీటీ, 4 అకౌంటింగ్ బృందాలు, 4 అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ పరిశీలకులను నియమించారు. ప్రతీ మండలం, మునిసిపాలిటీల్లో ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాకు 2,267 బ్యాలెట్ యూనిట్లు, 1,694 కంట్రోల్ యూనిట్లు, 1,791 వీవీ ప్యాట్‌లు అవసరం కాగా, మొదటి ర్యాండమైజేషన్ తరువాత 2,210 బ్యాలెట్ యూనిట్లు, 1,637 కంట్రోల్ యూనిట్లు, 1,734 వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించేందుకు 57బ్యాలెట్ యూనిట్లు, 57 కంట్రోల్ యూనిట్లు, 57 వీవీ ప్యాట్లను కేటాయించారు. ఇదిలా ఉంటే పోలింగ్ నిర్వహణకు 5,280 మంది సేవలు తీసుకోనున్నారు. ప్రిసైడింగ్ అధికారులు 1,320 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 1,320మంది, ఓపీవోలు 2,640 మంది అవసరం కానున్నారు. జిల్లా పరిధిలో మొత్తం 303 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించగా, వాటిలో పరిగి సెగ్మెంట్ పరిధిలో 72, వికారాబాద్ పరిధిలో 65, తాండూరు పరిధిలో 56, కొడంగల్ పరిధిలో 110 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి. చేవెళ్ల, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేంద్ర ఎన్నికల సంఘం సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించింది. వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, తాండూరుకు ఆర్డీవో శ్రీనివాసరావు, పరిగికి వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాలో ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు కొనసాగనుంది.

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఓటర్లు (అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా)

నియోజకవర్గం	ఓటర్లు
తాండూరు	2,43,849
వికారాబాద్	2,31,679
పరిగి	2,66,273
మహేశ్వరం	5,55,978
రాజేంద్రనగర్	5,99,585
శేరిలింగంపల్లి	7,47,673
చేవెళ్ల	2,69,087
మొత్తం	29,14,124

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఓటర్లు (అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా)

నియోజకవర్గం	ఓటర్లు
కూకట్‌పల్లి	4,71,878
కుత్బుల్లాపూర్	7,12,759
మల్కాజిగిరి	4,99,536
ఉప్పల్	5,33,544
మేడ్చల్	6,58,190
ఎల్బీనగర్	6,00,552
కంటోన్మెంట్	2,52,060
మొత్తం	37,28,519

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు : ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నగదు, మద్యం, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటివి అక్రమ రవాణా జరగ కుండా నిఘా పెంచామని, చెక్‌పోస్టుల్లో తనిఖీలు కూడా ప్రారంభించామన్నారు. చంద్రకల్, కొత్లాపూర్, కస్తూర్‌పల్లిల్లో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, మైల్వార్, ఇందర్‌చెడ్, నవాంద్గి, బొపునారంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో 303 మంది రౌడీ షీటర్లు, 428 మంది అనుమానితులు, 9 మంది కేడీలు, 6 డీసీలు ఉన్నారని, వారందరినీ బైండోవర్ చేయడమే కాకుండా వారిపైన గట్టి నిఘా ఉంచామని చెప్పారు. జిల్లాలో 21 వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో 243 మంది వద్ద లైసెన్సు ఆయుధాలు ఉండగా, వాటిలో బ్యాంకు సిబ్బంది తదితరులు వినియోగించే 25 ఆయుధాలకు మినహాయింపు ఇవ్వగా, ఇప్పటి వరకు 208 ఆయుధాలను పీఎస్‌ల్లో డిపాజిట్ చేశారని, మిగిలిన 10 ఆయుధాలను ఇంకా డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీసు శాఖ పరంగా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో బెల్ట్ దుకాణాలకు సంబంధించి 39 కేసులు, 3 గంజాయి కేసులు నమోదయ్యాయని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు విఘాతం కలిగించే విధంగా ప్రచారం చేస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు : వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు, సాధారణ పౌరులు పాటించాల్సిందేనని, ఎవరు ఉల్లంఘించినా ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్పీ కోటిరెడ్డి, ఏఆర్‌వోలు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసరావులతో కలిసి మాట్లాడారు. జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చేవెళ్ల, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. ఆ రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ఎక్కడైనా కార్యకలాపాలు కొనసాగుతుంటే వెంటనే సి-విజిల్ యాప్‌లో వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వంద నిమిషాల్లో తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సభలు, సమావేశాల అనుమతులకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నో యువర్ క్యాండిడేట్ యాప్ ద్వారా అభ్యర్థుల వివరాలు ఎవరైనా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్ల సమాచారానికి ఓటరు హెల్ప్‌లైన్ యాప్, టర్న్‌పోల్, కౌంటింగ్ యాప్, ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేయాలని నారాయణరెడ్డి సూచించారు. జిల్లా పరిధిలో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా తాండూరులో 8, కొడంగల్‌లో 7 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించామని, కొత్త పోలింగ్ కేంద్రాలకు అనుమతిస్తే జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 1,148 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీచేసే వారు ముందుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలన్నారు. నోటిఫికేషన్‌కు ముందు వచ్చే ప్రకటనల ఖర్చులన్నీ ఆయా పార్టీల ఖాతాల్లోకి జమ కానుండగా, నోటిఫికేషన్ విడుదలైన తరువాత అభ్యర్థుల ఖాతాల్లో జమ చేస్తారని ఆయన వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకు వెళితే దానికి సంబంధించిన రసీదులు, ఆధారాలు తప్పక ఉంచుకోవాలని, లేకపోతే అధికారులు ఆ నగదును సీజ్ చేస్తారన్నారు. రూ.10లక్షల కంటే ఎక్కువ మొత్తంలో తనిఖీల్లో పట్టుబడితే .. ఐటీ శాఖ అధికారుల అనుమతి తీసుకున్న తరువాతనే తిరిగి అప్పగించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి



మేడ్చల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ నోడల్ అధికారులకు ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం ఆయన కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి దిశనిర్దేశాలను జారీ చేశారు. 24-72 గంటల లోపు నిబంధనల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు సంస్థల్లో ప్రబ్లిక్ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార సాధనాలను పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్‌లను తొలగించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1950 ద్వారా, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించటంతో పాటు సి-విజిల్ యాప్ ద్వారా చేసే ఫిర్యాదులను వంద నిమిషాల్లో సరిష్కరించాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎంసీసీ టీమ్‌లు క్షేత్ర స్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ ఉపేక్షించ బోమన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ఫలితాలు వచ్చేంత వరకు అధికారులు అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, నోడల్ అధికారులు ఎన్నికల సూపరిండెంట్‌లు రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి నిలిపివేత

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికలు పూర్తయ్యే వరకు నిలిపివేస్తున్నామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాతే తిరిగి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

ముగిసిన ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు

వికారాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత నెలలో ప్రారంభమైన ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. జనరల్ పరీక్షలు గురువారంతో, ఒకేషనల్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్షలకు 1,183 మంది విద్యార్థులకు 1,141 మంది హాజరయ్యారు. జిల్లాలో జరిగిన ఇంటర్మీడియట్ జిల్లా వ్యాప్తంగా 17మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. కాగా ఇంటర్ స్పాట్‌వాల్యుయేషన్ ప్రక్రియా ప్రారంభమైంది.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



వికారాబాద్, మార్చి 16 : జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 80పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలకు బాలురు 6,913 మంది, బాలికలు 6,499 మంది మొత్తం 13412 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, అంతకు మించితే అనుమతించరని తెలిపారు. విద్యార్థులు వారి వారి హాల్ టిక్కెట్లలో వివరాలను సరి చూసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందుగానే సందర్శించి ప్రతి రోజూ ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసేందుకు అన్ని పరీక్ష కేంద్రాల్లో తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలోఉంచుకొని తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. విద్యార్థులు, పరీక్షలను నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావొద్దన్నారు. పరీక్ష కేంద్రంలో, పరిసరాల్లో సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధించామని ఆయన పేర్కొన్నారు. ఏమైనా సందేహాలుంటే డీఈవో కార్యాలయంలోని 08416-235245 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముందో.. వెనకో.. జంపవ్వాల్సిందే!

- పార్టీ వీడే బీఆర్ఎస్ నేతల మధ్య ఊపందుకున్న మంతనాలు
- మల్లారెడ్డి వస్తే అంతే సంగతులంటున్న కాంగ్రెస్ శ్రేణులు
- కాంగ్రెస్ నచ్చని వారు బీజేపీ వైపు



మేడ్చల్ టౌన్, మార్చి 16 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పదేళ్ల అధికార దర్పంతో కాలం వెళ్ల దీసిన నేతలకు ప్రస్తుతం చేదు అనుభవాలు తప్ప డం లేదు. రానున్న ఐదేళ్ల పాటు పార్టీకి మనుగడ లేదని పార్టీరి గుడ్‌బై చెప్పేందుకు నాయకులు సిద్ధమవుతు న్నారు. అధికారం లేకుండా రాజకీయాల్లో మనుగడ సాగించలేమన్న నమ్మకం బీఆర్ఎస్ గల్లీ లీడర్ నుంచి ఎమ్మెల్యే మల్లారెడ్డి వరకూ కన్పిస్తోంది. ఇప్పటికే కొందరు పాలక కాంగ్రెస్‌లో చేరగా మరికొందరు లోక్‌సభ ఎన్నికల లోపు పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు తమకు కాంగ్రెస్ పార్టీ ద్వారాలు ఎప్పుడు తెరుస్తుందో అని ఎదురుచూస్తున్నారు. మేడ్చల్ పట్టణం, మండ లంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది బీఆర్ఎ స్‌కు చెందిన వారే ఉన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కాగా ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ల పదవీ కాలం ఆరు నుంచి 11నెలల వరకు ఉంది. ఉన్న ఈ పదవీ కాలంలో ప్రజలకు సేవ చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి గెలవడమే ధ్యేయంగా బీఆర్ఎస్ నాయకులు పావులు కదుపుతున్నారు. ఇందుకు కాం గ్రెస్‌లో చేరడమే మార్గంగా భావిస్తున్నారు. ఇప్పటికే మాజీ సర్పంచ్‌లు చాలామంది కాంగ్రెస్‌లో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నచ్చని వారు బీజేపీలో చేరుతున్నారు.

చేరిక కోసం మార్గాలను అన్వేషిస్తున్న నేతలు

ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులకు స్థానిక కాంగ్రెస్ నేతలే అడ్డు పడుతున్నారు. దీంతో పాలక పార్టీలో చేరగోరే బీఆర్ఎస్ నేతలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి గ్రామ స్థాయి నుంచి ఎమ్మెల్యే వరకూ ఎదురవుతోంది. పార్టీలో చేరదల్చుకున్న నాయకులు చాలా మంది స్థానిక నేతలను పక్కనబెట్టి కాంగ్రెస్ అగ్ర నేతలతో తమకున్న పరిచయాలతో రాయబారాలు నడిపి స్థానిక నాయకులతో సంబంధం లేకుండా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏదో విధంగా ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వరకు చేరుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి సన్నిహితుడైన నియోజకవర్గంలోని మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త వారం రోజులుగా రేవంత్‌రెడ్డి సమయం ఇస్తే 10మంది కౌన్సిలర్లతో కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే రాకకు వ్యతిరేకం

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలు స్థానిక కాంగ్రెస్ నాయకులకు మింగుడుపడటం లేదు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అనుచరులు ఏ క్షణంలోనైన పార్టీ లో చేరతారన్న ప్రచారం జోరుందుకుంది. ఆయన ఇటీవల బెంగళూరులో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌ను కూడా ఇందుకే కలిశార నే ప్రచారం జరిగింది. దీంతో మేడ్చల్ కాంగ్రెస్ నేతల్లో కొత్త టెన్షన్ మొదలైంది. ముందు నుంచీ స్థానిక కాంగ్రెస్ నేతలకు నచ్చని మల్లారెడ్డి, ఆయన అనుచరులు పార్టీలోకి రావటం తమకు నష్టమేననికొందరు కాంగ్రెస్ చర్చించుకుంటున్నారు.

బీజేపీలోకి కొందరు..

ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారంతో చాలా మంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరుతున్నారు. మల్లారెడ్డితో ఎలాగోలా బీఆర్ఎస్‌లో దశాబ్దం పాటు నెట్టుకొచ్చిన జిల్లా రైతు సమితి అధ్యక్షుడు నందారెడ్డి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటే మరికొందరు బీజేపీలో చేరారు. మల్లారెడ్డి ఆయన అనుచరుల వేధింపులకు గురైన కాంగ్రెస్ నాయకులు సైతం మల్లారెడ్డి పార్టీలో చేరితే వారు కూడా బీజేపీలో చేరే ఆస్కారం లేక పోలేదు!

ఘట్‌కేసర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి నోటీసు

- కలెక్టరేట్‌లో తీర్మాన ప్రతిని అందజేసిన కౌన్సిలర్లు



డీఆర్వోకు అవిశ్వాస నోటీసును అందజేస్తున్న ఘట్‌కేసర్ మునిసిపాలిటీ కౌన్సిలర్లు

ఘట్‌కేసర్, మార్చి 16 : ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిపై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు నోటీసు ఇచ్చారు. శనివారం మెజార్టీ కౌన్సిలర్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆయన సూచనల మేరకు డీఆర్వో హరిప్రియకు అవిశ్వాస నోటీసుపత్రాన్ని అందజేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్లు ఉండగా 12 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ముల్లి పావని పదవి నుంచి దించాలని నిర్ణయానికి వచ్చారు. 18 మంది కౌన్సిలర్లలో 17 మంది బీఆర్ఎస్ వారే ఉన్నా అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరుగురు కాంగ్రెస్‌లో చేరారు. ఒక కౌన్సిలర్ స్వతంత్రుడు. అయితే సొంత పార్టీ కౌన్సిలర్లే పావనిపై మొదటి నుంచీ అవిశ్వాసం కోసం ఎదురు చూస్తున్నారు. వారికి తగిన మద్దతు లేక మౌనంగా ఉన్నారు. ఇటీవల కొన్ని వార్డుల్లో చైర్‌పర్సన్ కౌన్సిలర్లను కాదని సొంత నిర్ణయాలు తీసుకోవడంతో వారు ఆగ్రహంతో ఉన్నారు. శనివారం 10 మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు మొత్తం 12మంది చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసును డీఆర్వోకు అందజేశారు. ఇదిలా ఉంటే కౌన్సిల్ పదవీకాలం 9 నెలలే ఉంది.

'సుకన్య యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



సుకన్య సమృద్ధి ఖాతా పాసుపుస్తకాన్ని అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16 : ఆడ పిల్లల ఆర్థిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎదులాబాద్ పంచాయతీలో శనివారం సుకన్య సమృద్ధి స్కీమ్‌లో భాగంగా పోస్టాఫీస్‌లో ఖాతా తెరిచిన మహిళలకు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు సుకన్య సమృద్ధి యోజన ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఆడపిల్లల పేరిట ఖాతా తెరవాలన్నారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ అధికారులు బుక్యానాయక్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు శ్రీశైలం, సురేష్, రాంచందర్, వెంకటు, కిన్ని మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

- జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి



ఎదులాబాద్‌లో సాగునీటి కాలువల మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 16 : వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. నారాయణరావు చానెల్, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఆయకట్టు చుట్టూ కాలువల మరమతుల పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగనీటి కాలువల మరమతులను పట్టించుకోలేదని, దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పీర్జాదిగూడ నుంచి నారాయణరావు చానెల్ కత్వాకు రూ.60 లక్షలు, ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఆయకట్టు కట్టు కాలువలలకు రూ.26లక్షల నిధులు మంజూరయ్యాయని, నాణ్యతతో పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, కందుల కుమార్,సామల అమర్, విశ్వనాథం, బస్వయ్య, లింగం, సత్తయ్య, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళనలు

ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితను శుక్రవారం ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించాయి. రాస్తారోకో నిర్వహించి బీజేపీ, ఈడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కక్షతోనే బీజేపీ ఎన్నికల ముందు తమ నేతను అరెస్టు చేయించిందన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 16



ధారూరులో బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నాయకులు, కార్యకర్తలు

కులగణనకు ఉత్తర్వుల జారీ హర్షనీయం

బషీరాబాద్, మార్చి16: ఇంటింటి సమగ్ర కులగణనకు ప్రభుత్వం అమోదం తెలుపుతూ జీవో నంబరు 26కి ఉత్వర్వులు జారీ చేయడం హర్షనీయమని బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణనతో ఎ స్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల్లో విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు పెరిగేందుకు వీలుంటుందన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వికారాబాద్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఎన్నికల నిబంధనలను పాటించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడా ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడా ప్రారంభోత్సవాలు , సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించిన పనులు కొనసాగించవచ్చని తెలిపారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు పనిచేయాలన్నారు. వారి వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రీవెన్స్ సెల్ ప్రతీ ఏఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. మీడియా మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు, ఎంసీఎంసీ టీమ్‌లన్నీ నేటి(ఆదివారం) నుంచే పనిచేయాలని, పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంటు ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఓటరు జాబితాలో ఫామ్ 6, 7, 8 పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఫామ్ 12డీ సిద్ధంగా ఉంచాలన్నారు.

ధారూరు మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులకు బీట్లు

ధారూరు, మార్చి 16: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ, మొక్కజొన్న వ్యవసాయ ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కంది క్వింటాలుకు గరిష్ఠంగా రూ.10,300, కనిష్ఠంగా రూ. 10,050, వేరుశనగ క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,850, కనిష్ఠంగా రూ. 6600లు, మొక్కజొన్న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,250, కనిష్ఠంగా రూ.2,200 ధరలకు విక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్

వికారాబాద్/పరిగి, మార్చి 16 : లోక్ అదాలత్‌లో రాజీపడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.సుదర్శన్ అన్నారు. వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా వికారాబాద్ కోర్టులో మొత్తం 623 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే లోక్‌అదాలత్‌తో కేసు నుంచి విముక్తి కలగవచ్చన్నారు. రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శృతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి

కేసులు సత్వరమే పరిష్కారం

కేసుల్లోని ఇరుపక్షాలు రాజీపడితే కేసులను సత్వరమే పరిష్కారం అవుతాయని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. ఈ సందర్భంగా మొత్తం 431 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీవో దీపారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీపడితే ఇరుపక్షాలూ గెలిచినట్టే

షాద్‌నగర్‌అర్బన్/చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/మాడ్గుల : సమస్యల పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్టే అవుతుందని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి అన్నారు. షాద్‌నగర్ కోర్టు సముదాయంలోని మూడు కోర్టుల్లో శనివారం మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో ఇరువర్గాలు రాజీపడడంతో 186 క్రిమినల్, ఒక సివిల్, 383 డ్రంకెన్‌డ్రైవ్, 2730పీటీ, ఒక బ్యాంక్, రెండు భూవివాద కేసులను పరిష్కరించారు. వివిధ కేసుల్లో రూ.15,26,500 జరిమానాలను వసూలు చేసినట్టు కోర్టు వర్గాలు తెలిపారు. ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2181 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి. పోలీస్‌స్టేషన్ల వారీగా ఆదిభట్ల 623, ఇబ్రహీంపట్నం 493, యాచారం 457, మంచాల 436, హైదరాబాద్ గ్రీన్ ఫార్మా పరిధిలో 172 కేసులు పరిష్కరించారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మొత్తం 2843 కేసులు పరిష్కరం కాగా, రూ.15,87,260 డబ్బులు జరిమానాలు విధించారు. మాడ్గుల పీఎస్‌కు సంబంధించి ఆమనగల్లు కోర్టులో కక్షిదారులు రాజీపడినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. 22 క్రిమినల్, 244 పిటీ కేసుల్లో రాజీపడినట్లు చెప్పారు. ఆమనగల్లులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలకు సంబంధించి 1609 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

● వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 16: నియోజకవర్గంలో పార్లమెంటరీ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించబడిన అధికారులు వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం వికారాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికారాబాద్ నియోజకవర్గంలో 12శాతం పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ చొప్పున 25మంది సెక్టోరల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 1400మంది, పట్టణ ప్రాంతాల్లో 1500 మంది ఓటర్లను మించి ఉండకుండా జాగ్రత్తలు చెప్పినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, అకౌంట్స్ టీమ్‌లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డే..

● మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

కొత్తూర్, మార్చి 16: రాబోయే పదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డే కొనసాగుతారని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన జితేందర్‌రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం తిమ్మాపూర్ వద్ద శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతానని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విశాలాశ్రవణ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, జిల్లెలరాంరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, శ్రీనివాస్, తుపాకుల శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

చేవెళ్ల, మార్చి 16 :ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకోవడం ద్వారానే మాదిగలకు న్యాయం జరుగుతుందని, వారి జీవితాల్లో చీకటి తొలగి, వెలుగు వస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. చేవెళ్లలో మాదిగ ఉపకులాల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ లేకపోవడం వల్లే విద్యా, ఉద్యోగాల్లో మాదిగలకు రావాల్సిన అవకాశాలు దక్కకుండా పోతున్నాయని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసింహ, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రావు, మల్లికార్జున్, ప్రశాంత్, ఆనంద్, భాను, తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : కొండా


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ కంజర్ల మాల్‌లో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. తన గెలుపు కోసం యువత, ఏబీవీపీ కార్యకర్తల సహకారం అవసరమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, కొలన్ శంకర్‌రెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌రాజ్, బుచ్చిరెడ్డి, సుచరితరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హతతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, మార్చి16: బీటెక్ చేసినంత మాత్రాన ఉద్యోగ కల్పన సాధ్యం కాదని నైపుణ్యం ఉంటేనే ఏదైనా కంపెనీలో ఉద్యోగం పొందవచ్చని వివిధ కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో శనివారం హెచ్‌ఆర్ కాంక్లేవ్ -2024 పేరుతో జాతీయ సదస్సు జరిగింది. హెడ్ టాక్స్ హెక్సగోన్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, సీహెచ్‌ఆర్‌వో కేయోలిస్ సహా 20 బహుళ జాతి కంపెనీలకు చెందిన ప్రతినిధులు మాట్లాడారు. ఏదైనా కంపెనీని ఎంచుకునేటప్పుడు పూర్వాపరాలు, ఉద్దేశ్యాలు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారితో మాట్లాడి సలహాలు తీసుకున్నారు. గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషి సాయల్, జాయింట్ డైరెక్టర్ డా.పార్థసారధి, డా.ఎస్.రంగనాయకులు, కార్పొరేట్ రిలేషన్స్ వినయ్ చోప్రా, తదితరులుపాల్గొన్నారు.

ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 16 : రాష్ట్రంలో ఎన్నిక ఏదైన కాంగ్రెస్‌దే విజయమని, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో అదే జరుగబోతుందని అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. జీవన్‌రెడ్డి విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని వారికి సూచించారు.సమావేశంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాములు, పాలకుర్ల ఉమావతి, నిర్మలాదేవి తదితరులు ఉన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చౌదరిగూడ, మార్చి 16 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం లాల్‌పహాడ్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పని చేస్తున్న కూలీలకు మంచినీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డు లేని వారికి కార్డులు అందించి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజనేయులు, వెంకటేష్, గోపాల్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయుడి పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 16 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం ఆంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భజన చేస్తూ భక్తులు స్వామిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, జి. వసంతరావు, ఎల్. రఘుగౌడ్, రఘునందన్‌రెడ్డి, జి. రమేష్‌ముదిరాజ్, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 16 : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని పొద్దటూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కమ్మెట గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 14 ఎంపీసీట్లు కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్, ఎజాస్, బుచ్చయ్య, ఆనంద్, తిరుపతి, క్రాంతి, ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తలకొండపల్లి, మార్చి16: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అంగన్వాడీ టీచర్లు అనసూయ, సువర్ణ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు చిరుధాన్యాలు తీసుకోవడంతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

వికారాబాద్, మార్చి 16: గత టెట్, డీఎస్సీల్లో జిల్లా మొదటి, మూడో, నాల్గో ర్యాంకులు సాధించిన వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీసర్కిల్‌లో ఈనెల 18, 19, 20వ తేదీల్లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ టీవీ రమణ తెలిపారు. మే 20 నుంచి టెట్ పరీక్షలు, జూలై 17 నుంచి డీఎస్సీ పరీక్షలు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని తెలుగు రాష్ట్రాల్లోని అగ్రశ్రేణి అధ్యాపక బృందంతో వికారాబాద్‌లోని నిరుద్యోగ బీఎడ్, డీఎడ్ విద్యార్థుల కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు తెలుగు రాష్ట్రాల్లోని అధ్యాపక బృందం పాల్గొననుంది. డీఎడ్ సెకండియర్, బీఎడ్ సెకండియర్ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే అభ్యర్థుల కోసం ఈవినింగ్ బ్యాచ్ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9441022571 నెంబరును సంప్రదించాలని సూచించారు.


కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

తాగునీటి సమస్య పరిష్కరించండి

మేడ్చల్ టౌన్, మార్చి 16: మేడ్చల్‌లోని బ్రాడ్ వే కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు. కాలనీలో ఇప్పటి వరకూ మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయక పోవటంతో బోరు బోవులపై ఆధారపడి తమ అవసరాలు తీర్చుకుంటున్నారని నేతలు తెలిపారు. మంచి నీటి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి కుళాయిల ద్వారానీటి సరఫరా చేయాలని కమిషనర్‌తో కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ తమ సిబ్బంది కాలనీని సందర్శించి తగు చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

పాండురంగ ఆలయంలో పుష్పార్చన

తాండూరు, మార్చి 16: తాండూరులోని 24వ వార్డులో గల పాండురంగ దేవాలయ వార్షికోత్సవ అన్ని పురస్కరించుకుని శనివారం ఆలయధర్మకర్త మేడిశెట్టి జగన్నాథంచంద్రకళ ఆధ్వర్యంలో లక్షపూల అర్చన హోమం, పాండురంగ కల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు వార్డుకౌన్సిలర్ సాహుశ్రీలత, మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమళ, మాజీ మున్సిపల్ చైర్మన్లు కోట్రిక విజయలక్ష్మి, సునీతసంపత్, కౌన్సిలర్ ప్రభాకర్, నీరజాబాల్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మహిళలు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మంచాల, మార్చి 16 : ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని మంచాల సీఐ బబ్యానాయక్ సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బబ్యానాయక్ మాట్లాడుతూ ఓటర్లకు ఆత్మస్థైర్యం నింపేందుకు గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రవి నాయక్, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరుట్లలో పోలీసుల కవాతు

రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవిత అరెస్టు


కొడంగల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


పరిగి: ధర్నాలో మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కొడంగల్, మార్చి 16: రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రపూరితంగా అరెస్టు చేయించారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఆయన కొడంగల్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టడంలేదని, ఉన్నత న్యాయ స్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగానే ఇలాంటి చర్యలకు పాల్పడం అప్రజాస్వామికం అన్నారు. ఎమ్మెల్సీ కవితను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దౌల్తాబాద్ ఎంపీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, మహేందర్‌రెడ్డి, భీములు, గోవిందు, రహమత్‌ఖాన్, రాఘవేందర్‌రెడ్డి, శ్రవణ్, నరేశ్, నవాజుద్దీన్, పకీరప్ప, కాశప్ప, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం పరిగిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై కవితను అరెస్టు చేయించారని ఆరోపించారు. కవిత నిర్దోషిగా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చర్మన్ ఎం.అశోక్, పరిగి, పూడూరు ఎంపీపీలు అరవింద్ రావు, మల్లేశం. దోమ జడ్పీటీసీ కె.నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు బి.ప్రవీణ్‌రెడ్డి, నాయకులు భాస్కర్, కృష్ణ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ధారూరు: ఎమ్మెల్సీ కె.కవిత అరెస్టుపై శనివారం ధారూరులో బీఆర్ఎస్ పార్టీ నిరసన తెలిపింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నిరసనలో పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా ఎమ్మెల్సీ కవితను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. కేంద్రం రాజకీయ కుట్రతో ఈడీతో కవితను అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో వారు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజునాయక్, పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, కె.అంజయ్య, ఎ.అంజయ్య, వెంకటయ్య, భీంసేన్ మహేష్ పాల్గొన్నారు.

వికారాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీయాలనే ప్రధాని మోడీ, సీఎం రేవంత్‌రెడ్డిలు ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేయించారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈడీ, సీబీఐలను ప్రాంతీయ పార్టీ నేతలపై ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధిచెప్పాలని పిలుపు పిచ్చారు.

సమాచారం లేకుండా అరెస్టు చేయడమేంటి?

మేడ్చల్ టౌన్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ముందస్తు సమాచారం లేకుండా ఈడీ అధికారులు అరెస్టు చేసి ఢిల్లీ తీసుకెళ్లడమేంటని బీఆర్ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ అన్నారు. కవిత అరెస్టుకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు శనివారం మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకులు జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్, విష్ణు చారి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రచేసి మహిళ అని చూడకుండా రాత్రి సమయంలో అరెస్టు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది నుంచి కేసు విచారణ జరుగుతోందని, సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉండగానే అరెస్టు చేయడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఇలాంటి బెదిరింపులు కొత్తకాదన్నారు. ఈసందర్భంగా మోడీ డౌన్‌డౌన్.. బీజేపీ డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మాధవరెడ్డి, హరిశంకర్, ధర్మారెడ్డి, రమేష్, రాధాకృష్ణారెడ్డి, ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


ఘట్‌కేసర్: అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ కార్యకర్తల నిరసన

క్రైం కార్నర్

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

పూడూరు, మార్చి 16: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో జరిగింది. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు కుర్వ రాజు(28) ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం రూ.3 లక్షలు అప్పు చేయగా, వడ్డీతో కలిపి అది రూ.5 లక్షలు అయింది. ఇదే సమయంలో పంటలు సరిగా పండక దిగుబడి రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు.

రైలుకింద పడి వ్యక్తి..

వికారాబాద్, మార్చి 16: రైలుకింద పడి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి రైల్వేస్టేషన్ నుంచి తాండూర్ వెళ్లే రైలు మార్గంలో ఎల్లమ్మ గుడి దాటాక ఓ వ్యక్తి సాయంత్రం 6 గంటల సమయంలో కాచిగూడ వాడి ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి మృతిదేహాన్ని పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు దౌల్తాబాద్ మండలానికి చెందిన జీపీ శ్రీను(19)గా గుర్తించామని, ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 16: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రవెల్లి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శ్రీనివాస్ రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా శనివారం డబీల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని జిల్లా కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సమస్యలు వచ్చినా వాటిని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన మహనీయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నేటి కాంగ్రెస్ నేతలకు ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామస్థాయి నుంచి పీసీసీ స్థాయి వరకు పార్టీలో పదవులు చేపట్టి సేవలందించారన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మేడ్చల్ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు భౌగోళిక పటాల పంపిణీ


విద్యార్థులతో విద్యావంతుల వేదిక ప్రతినిధులు

బొంరాస్‌పేట్, మార్చి 16: కిసాన్‌బంధు, విద్యావంతుల వేదిక, సెల్ఫ్ ఫోర్స్ ఆధ్వర్యంలో మండలంలోని చౌదర్‌పల్లి కేజీబీవీ, చెట్టుపల్లి తండా ఆశ్రమ పాఠశాల, బొట్లవనితండా పాఠశాల, కొడంగల్ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 200మంది విద్యార్థులకు శనివారం భౌగోళిక పటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక నాయకులు మాట్లాడుతూ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్య చేసుకుంటే బాధిత కుటుంబాలకు, ఒంటరి మహిళలకు, పేద విద్యార్థులకు 2004 నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ పేరుతో భూములను లాక్కుంటే ఊరుకోం

బొంరాస్‌పేట్, మార్చి 16: దుద్యాల మండలంలోని హకీంపేట్, లగచర్ల, పోలెపల్లి, పుల్చారుగుంట తండా గ్రామాల్లో 1174 ఎకరాల భూమిని ఫార్మాసిటీ పేరుతో లాక్కోవాలని చూస్తే ఊరుకోమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. హకీంపేట్ గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో రైతుల భూములు తీసుకొని రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదన్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం ప్రైవేట్ కంపెనీల కోసం భూములు తీసుకోవాలనుకుంటే 80శాతం మంది రైతులు ఆమోదం తెలిపితేనే తీసుకునేందుకు వీలుంటుందన్నారు. ఇప్పటికైనా అయాగ్రామాల భూముల జోలికి వెళ్లమని కలెక్టర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, గ్రామపెద్దలు మల్లికార్జున్, శివకుమార్, శ్రీనివాస్, సి.శ్రీనివాస్, పి.వెంకటయ్య, బసప్ప, గోపాల్‌నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

గురుకుల్ విద్యాలయ అభివృద్ధికి చర్యలు


ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయాన్ని సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 16: ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం గురుకుల్ విద్యాలయంను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యంకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే గురుకుల కళాశాల, పాఠశాల మౌలిక వసతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.50కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈనిదులతో అదనపు తరగతిగదులను నిర్మించడంతో పాటు పర్నిచర్ వంటి సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. గత పాలకులు గురుకుల్ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని వాపోయారు. పేద విద్యార్థులు చదువుకునే విద్యాలయంను పటిష్ఠపర్చడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. గురుకుల్‌ను అభివృద్ధి పరిచి పూర్వ వైభవంను తీకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అబ్బసాని యాదగిరి, నర్సింగ్‌రావు, నాగరాజు, ఖయ్యూం, మల్లేష్, రాధాకృష్ణ, రమేష్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ


రాంసింగ్ నాయక్ తండాలో బ్యాగులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కులకచర్ల, మార్చి 16: చౌడాపూర్ మండలంలోని రాంసింగ్ నాయక్ తండాలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ బొమ్మ కలిగిన బ్యాగులను ఇంటింటికీ పంపిణీ చేశారు. కేంద్రంలో మూడో సారి బీజేపీ అధికారంలోకి రావాలని ప్రధానిగా నరేంద్రమోదీ కావాలని, చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్ గెలుపొందాలని ప్రచారం చేస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్‌నాయక్, పాండు, సంజ్యానాయక్, తండావాసులు మంగ్య, మన్యనాయక్, దశరథ్, రెడ్యా, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం


పార్కును ప్రారంభిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, మార్చి 16: నాగారం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో శనివారం రూ.5లక్షలతో చేపట్టిన పార్కు ప్రహరీని, 18వ వార్డులో రూ.మూడు లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, 19వ వార్డులో రూ.13.30లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు అదేవిధంగా రూ.మూడు లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు అన్నంరాజ్ లావణ్య, సుర్వి శ్రీనివాస్, పంగ హరిబాబు, నాయకులు అన్నంరాజ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చూడాలి


కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సుతారి గూడ వాసులు

మేడ్చల్ టౌన్, మార్చి 16: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డ్రైనేజీనీరు నేరుగా తమ గ్రామ చెరువులో కలవడంతో చెరువు కలుషితమవుతోందని సుతారిగూడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గుండ్లపోచంపల్లి కమిషనర్ రాములకు శనివారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామ పరిధిలో ఉన్న ఒక్కగానొక్క చెరువును నేడు సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వారు పూర్తిగా కలుషితం చేశారని ఆరోపించారు. కనీసం పశువుల దాహార్తినీ తీర్చలేని స్థితిలో చెరువు నీరు కలుషితమవుతోందిన గ్రామస్తులు వాపోయారు. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి చెరువు వైపు మురికినీటితో ప్రవహించే కాల్వను వెంటనే పూడ్చివేయాలని గ్రామస్తులు కోరారు. అధికారులు స్పందించకుంటే సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ


చెంగోల్ గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూర్ రూరల్, మార్చి 16: మండలంలోని చెంగోల్ గ్రామంలో శనివారం ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డి, తాండూర్ జడ్పీటీసీ గౌరి మంజుల వెంకటేశం, యువజన సంఘం సభ్యులు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు శివాజీ భజన సంఘం అధ్యక్షుడు రాకేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శశికాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేశ్, కిషోర్, బీజేపీ, వివేకానంద యువజన సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు సాయిరాం, ముఖేశ్, వడ్ల నరేశ్, ఎల్లప్ప, మణికుమార్‌గౌడ్, నాగప్ప, రాజు, మహేశ్ ముదిరాజ్, అక్రమ్ పలువురు యువకులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై విఠల్‌రెడ్డి, జడ్పీటీసీ గౌరి మంజుల వెంకటేశంను వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం ముందుకు వచ్చిన యువకులను అభినందించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. జడ్పీటీసీ మంజుల మాట్లాడుతూ శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత ప్రయాణించాలన్నారు.

నేటి నుంచి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు

కులకచర్ల, మార్చి 16: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ శ్రీరుక్మిణి పాండురంగ స్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరణం నాగేశ్వర్ రావు తెలిపారు. ఆదివారం ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవచనం, శ్రీవారికి విశేష పంచామృత అభిషేకం, సాయంత్రం శకటోత్సవం, ప్రదోష పూజ, తొట్టి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. సోమవారం సుప్రభాతసేవ, విశేష పంచామృత అభిషేకం, పల్లకీసేవ, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం శ్రీరుక్మిణి పాండురంగ స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.1016 చెల్లించి రశీదు పొందాలని కోరారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

పెద్దేముల్, మార్చి 16: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. మండలంలో పదోతరగతి పరీక్షలకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో మొత్తం 574 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. జిల్లా పరిషత్ పాఠశాల మంబాపూర్, పెద్దేముల్ బాలుర, పెద్దేముల్ బాలికల పాఠశాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 198 మంది విద్యార్థులు, బాలికల పాఠశాలలో 182 మంది విద్యార్థులు, మంబాపూర్ పాఠశాలలో 194 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు.

బషీరాబాద్: ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పదోతరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు.మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు, మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాలను శనివారం వారు పరిశీలించారు. ఈ పదోతరగతిలో మొత్తం 508 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వారు వెల్లడించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ధారూరు, మార్చి 16: నాగారం గ్రామంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన మద్దుల పల్లి ప్రేమ్‌కుమార్ అలియాస్ శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. నాగారంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయకేంద్రంలో, వరికొనుగోలు కేంద్రంలో హమాలీగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ విద్యుదాఘాతంతో మృతిచెందడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూడాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సొసైటీ ఆవరణలోఓ ప్రేమ్‌కుమార్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈవో నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ తరఫున మాజీసర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు జోగు అనంతయ్య, వెంకటయ్య, నారాయణ మృతుడి ఇంటికి వెళ్లి రూ.5వేలు నగదును అందజేశారు.

విద్యార్థి దశ కీలకమైనది


విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ పంపిణీ చేస్తున్న మల్కా యశస్వి

మూడుచింతలపల్లి, మార్చి 16: విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ సీఈవో మల్కా యశస్వి అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి స్కూల్స్ సహకారంతో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టేషనరీ, ఇతర వస్తువులను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు కృషి చేయాలని అన్నారు. ఒత్తిడికి అధిగమించి పరీక్షలు రాయాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

దోమ: మండలంలోని అయినాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మేకల గోవర్ధన్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు తనవంతుగా సాయం చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ధనేశ్వర్, ఉపాధ్యాయులు బ్రహ్మాచారి, నాగప్ప, మల్లేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **పూడూరు:** సోమన్‌గుర్తి పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రధానోపాధ్యాయుడు అంజిలయ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈవో కార్యాలయం నుంచి సీయంవో రజనీ, సీఆర్‌పీ జంగయ్య, ఉపాధ్యాయులు సంగీత, నవీన్‌కుమార్ హాజరయ్యారు.

● **మేడ్చల్ టౌన్:** బ్రాడ్ వే కాలనీలో నెల కొన్ని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ బ్రాడ్ వే కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు.

● **మేడ్చల్ టౌన్:** మల్కాజిగిరిలో మోదీ రోడ్డు షోలో శుక్రవారం పాల్గొనటానికి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్, సెన్సార్ బోర్డు సభ్యురాలు అమరం సరస్వతి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ వెళ్లారు. మోదీని కలవడం తమ అదృష్టంగా భావిస్తున్నారు. జీవితంలో మరవని ఘట్టంగా వారు పేర్కొన్నారు.

● **వికారాబాద్:** పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్. మహిపాల్ ఆధ్వర్యంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ రావు, రాష్ట్ర కోశాధికారి ఉంగుర్ రాములు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు.

● **దోమ:** ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ఏదులాబాద్‌కు చెందిన పులిపాక సాయిలు మృతిచెందడంతో శనివారం ఆయన వారికి కుటుంబసభ్యులకు ఏదులాబాద్ సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ గాయారు విశ్వనాధం అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందజేశారు.

● **శామీర్‌పేట:** అలియాబాద్‌లో కీర్తిశేషులు గౌరారం లక్ష్మయ్య ఇంచి నుంచి ఎక్కలదేవి నాగేష్ ఇంటి వరకు ఎంపీటీసీ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ అనిత లాలయ్యశనివారం ప్రారంభించారు.


● **శామీర్‌పేట:** దాతల సహకారంతో పాఠశాల గదుల నిర్మాణానికి కృషి చేసిన జడ్పీటీసీ అనితలాలయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శనివారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి శ్రీ చైతన్య యాజమాన్యం సహకారంతో రూ.65 లక్షల నిధులతో పాఠశాల భవనాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో కస్తూర్‌పల్లి గ్రామ నాయకులు

కొడంగల్ రూరల్, మార్చి 16: మండలంలోని కస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గ్రామ అభివృద్ధి పనులు, సిమెంట్ ఫ్యాక్టరీ, లొంక బసవన్న ఆలయ అభివృద్ధి గురించి సీఎంకు వివరించారు. సీఎంను వారు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొట్రికె అశోక్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, దాసరి వెంకటప్ప, కుమ్మరి అశోక్, కాశప్ప, చంద్రకాంత్, డి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం


అనంతసాగర్‌లోని ఇసుక డంపు

కులకచర్ల, మార్చి 16: మండలంలోని అనంతసాగర్ గ్రామ పరిధిలో సీజ్ చేసిన ఇసుక డంపులను శనివారం వేలం వేశారు. ఈ వేలంలో అదే గ్రామానికి చెందిన చిల్ల మహేశ్ రూ.57వేల 500కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. వేలం డబ్బులు డిపాజిట్ చేయగానే ఇసుకను తరలించేందుకు అనుమతులు జారీచేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గిర్దావర్ ఖాజా పాల్గొన్నారు.